

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 346 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 17, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

న్యాయం కోసమే..
నాలుగో స్తంభం !

ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభంగా నిలుస్తున్న పత్రికా రంగం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. అధికార దుర్వినియోగం, అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత రక్షణ, ఆర్థిక భరోసా లేకుండానే ప్రజల పక్షాన నిలబడి కలం యుద్ధం చేస్తున్నది జర్నలిస్టులేనని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేసే పాత్రికేయులు రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల బెదిరింపులు, అవమానాలను ఎదుర్కొంటూ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని అన్నారు. ప్రజల హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం, పాలకుల తప్పులను ఎత్తిచూపడం పత్రికా రంగం ప్రధాన బాధ్యత అని గుర్తుచేశారు. నవంబర్ 16న జరుపుకునే జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల భద్రత, ఆర్థిక సంక్షేమం, వృత్తిపరమైన స్వేచ్ఛకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పేదరికంలో జీవిస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న సాధారణ జర్నలిస్టులకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలని ఆకాంక్షించారు. జర్నలిజం ఎవరి అధిపత్యానికో, రాజకీయ ప్రయోజనాలకో తలవంచే వృత్తి కాదని, ప్రజల పక్షాన నిలబడే నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. నిజాన్ని నిర్భయంగా వెలికితీసే జర్నలిస్టులకు సమాజం అండగా నిలవాలని డాక్టర్ బరిగెల శివ విజ్ఞప్తి చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)



వివరాలు 2లో











- ప్రజాస్వామ్య రక్షణ కోసమే జర్నలిస్టుల తిరుగుబాటు
- అరాచక శక్తుల దాడుల్లో నలిగిపోతున్న కలం యోధులు
- అవినీతిపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉన్నారు
- ఆకాశమంత అవమానాలను అలవోకగా ఎదుర్కొంటున్నారు
- ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిరూపాలు జర్నలిస్టులు
- నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు నిలువెత్తు గర్వం ఉంటుంది
- వ్యక్తిగత రక్షణ లేకుండా నిజాయితీగా పోరాడేది జర్నలిస్టులు ఒక్కరే
- తిట్టులు, నిందలు అవమానాలు రోజువారి అనుభవాలు
- పేద ప్రజల హక్కులకు రక్షణగా ఉంటుంది జర్నలిస్టులే
- వేధింపులను ఎదుర్కొని వృత్తిని నిర్వహించడం జర్నలిస్టులకే సాధ్యం : డాక్టర్ బరిగెల శివ

సేవా రంగంలో స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం డాక్టర్ భాస్కరరావు

మర్యాదపూర్వకంగా కలుసుకుని
ఆత్మీయ సన్మానం చేసిన డాక్టర్ బరిగెల శివ
వైద్య సేవల ద్వారా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న
డాక్టర్ భాస్కరరావు సేవలు అభినందనీయం





పోలీస్ స్టేషన్ గ్రూపుల్లో పెత్తనం ఎవరిది? మీడియా సమాచారానికి అడ్డుకట్ట ఎందుకు?

వాట్సాప్ గ్రూపులు కొందరి గుప్పిట్లోకి.. 2
అడ్మిన్లదే అంతా అన్నట్లుగా వ్యవహారం

క్రైమ్ వార్తలు ఎవరు పంపాలి? ఏ వార్త బయటకు రావాలి? నిర్ణయించేది ఎవరు?
పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకుని పారదర్శక వ్యవస్థకు శ్రీకారం చుట్టాలి

బీఎల్ఏ చీఫ్‌గా పాక్ మాజీ ఆర్మీ కెప్టెన్! 2

కొత్త కమాండర్ ఇన్ చీఫ్‌గా రెహ్మాన్ గుల్ నియామకం

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి రెడ్డి ఐపీఎస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ బరిగెల శివ

హైద్రాబాద్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)



మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుమతి రెడ్డి ఐపీఎస్ జన్మదినం సందర్భంగా జై భీమ్ టీవీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ఆమెను ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుమతి రెడ్డి ఐపీఎస్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్ బరిగెల శివ ఆకాంక్షించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ నిర్వహిస్తున్న పాత్ర ఎంతో కీలకమని, నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, ప్రజలకు న్యాయం అందించే విషయంలో పోలీసు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం కలిగేలా అధికారులు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పోలీసు శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొంటూ, సుమతి రెడ్డి ఐపీఎస్ తన బాధ్యతలను విజయవంతంగా కొనసాగిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

రాజమహేంద్రవరంలో మానవ హక్కుల కమిషన్ క్యాంప్ కోర్టు ప్రారంభం

కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం. సత్యనారాయణ మూర్తికి స్వాగతం పలికిన సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్






రాజమహేంద్రవరం, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో క్యాంప్ కోర్టు ప్రారంభమైంది. ఈ సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం. సత్యనారాయణ మూర్తికి సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ క్యాంప్ కోర్టు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కమిషన్ విచారణ చేపట్టనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రస్తుత తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పోలవరం జిల్లాలకు సంబంధించిన మానవ హక్కుల ఉల్లంఘన కేసులను ఈ క్యాంప్ కోర్టులో విచారించనున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించి, బాధితులకు న్యాయం జరిగేలా విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పెండింగ్ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు, నివేదికలు, అవసరమైన రికార్డులతో విచారణకు హాజరుకావాలని కమిషన్ ఆదేశించింది. విచారణకు అవసరమైన సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు కేసుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించింది.

బీఎల్ఏ చీఫ్‌గా పాక్ మాజీ ఆర్మీ కెప్టెన్!

కొత్త కమాండర్ ఇన్ చీఫ్‌గా రెహ్మాన్ గుల్ నియామకం
డ్రోన్లు, ఆధునిక ఆయుధాలతో దాడి వ్యూహాల్లో మార్పులు
పాక్ సైన్యంలోని అసంతృప్త అధికారులే లక్ష్యంగా రిక్రూట్‌మెంట్
బలోచ్ ప్రజలపై దౌర్జన్యాలే ఫిరాయింపులకు కారణమంటున్న వర్గాలు
కొత్త నాయకత్వంతో పాక్‌కు పెరగనున్న భద్రతా సవాళ్లు



ఇస్లామాబాద్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్) :

కొత్త స్వరం) : బలోచిస్థాన్‌లో పాకిస్థాన్ ప్రభుత్వానికి సవాల్‌గా మారిన బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) తన కొత్త కమాండర్ ఇన్ చీఫ్‌గా పాక్ మాజీ ఆర్మీ కెప్టెన్ రెహ్మాన్ గుల్ అలియాస్ మురీద్ బలోచ్‌ను నియమించినట్లు కథనాలు వెల్లడించాయి. గతంలో పాక్ సైన్యంలోని 19వ ఫ్రాంటియర్ ఫోర్స్ రెజిమెంట్‌లో పనిచేసిన ఆయన, బలోచిస్థాన్ సమస్యపై ప్రభుత్వ వైఖరితో విభేదించి సైన్యం నుంచి వైదొలిగి బీఎల్ఏలో చేరినట్లు సమాచారం. కొద్ది కాలంలోనే రెండో కమాండర్ స్థాయికి ఎదిగి, మజీద్ బ్రిగేడ్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. మరోవైపు బీఎల్ఏ తన దాడి వ్యూహాల్లో మార్పులు చేస్తూ ఐఈడీలు, మెరుపు దాడులతో పాటు అత్యాధునిక ఆయుధాలు, సైనిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసిన క్వాడ్‌కాప్టర్ డ్రోన్లను పాక్ భద్రతా దళాలపై ఉపయోగిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. పాక్ సైన్యంలోని అసంతృప్త అధికారులు, సిబ్బందిని గుర్తించి తమవైపు తిప్పుకునేందుకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ విభాగాలు పనిచేస్తున్నాయని నిఘా వర్గాల సమాచారం. బలోచ్ ప్రజలపై దౌర్జన్యాలు, బలవంతపు అదృశ్యాలు, మహిళలపై వేధింపులు, అభివృద్ధిని విస్మరించడం వంటి అంశాలపై సైన్యంలో అసంతృప్తి పెరుగుతోందని, ఇవే కొందరు సైనికులు ఫిరాయించడానికి కారణమవుతున్నాయని కథనాలు వెల్లడించాయి. పాక్ సైనిక వ్యూహాలపై అవగాహన ఉన్న మాజీ కెప్టెన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించడం బీఎల్ఏ కార్యకలాపాల్లో కీలక పరిణామంగా, బలోచిస్థాన్‌లో పాక్ ప్రభుత్వానికి భద్రతాపరమైన సవాళ్లు మరింత పెరిగే అవకాశమున్న అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

న్యాయం "కోసమే" నాలుగో స్తంభం

ప్రపంచ మేధావులలో పత్రికా జర్నలిస్టులు
ప్రజాస్వామ్య రక్షణ కోసమే జర్నలిస్టుల తిరుగుబాటు
అరాచక శక్తుల దాడుల్లో
నలిగిపోతున్న కలం యోధులు
అవినీతిపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉన్నారు
ఆకాశమంత అవమానాలను అలవోకగా
ఎదుర్కొంటున్నారు
ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిరూపాలు జర్నలిస్టులు
నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు
నిలువెత్తు గర్వం ఉంటుంది
వ్యక్తిగత రక్షణ లేకుండా నిజాయితీగా
పోరాడేది జర్నలిస్టులు ఒక్కరే
తిట్టులు, నిందలు అవమానాలు
రోజువారి అనుభవాలు
పేద ప్రజల హక్కులకు రక్షణగా ఉంటుంది జర్నలిస్టులే
వేధింపులను ఎదుర్కొని వృత్తిని నిర్వహించడం
జర్నలిస్టులకే సాధ్యం : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశంలో పత్రిక స్వేచ్ఛకు భంగం కలుగుతున్నప్పటికీ ప్రజల పక్షాన బరితెగించి గిరిగీసి కొట్లాడేది జర్నలిస్టులేనని డాక్టర్ బరిగెల శివ గర్వపడ్డారు. న్యాయాన్ని రక్షించడం కోసం అన్యాయాన్ని ఎదిరించడం కోసం జర్నలిస్టులు పడుతున్న కష్టాలు మామూలువి కాదని ఎంతో కష్టమైన పరిస్థితులను ఎంతో కఠోరమైన పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన ప్రజాస్వామ్యవాదుల పక్షాన నిలుస్తున్నారన్నది జగమెరిగిన సత్యం అన్నారు. భారతదేశంలో పత్రిక స్వేచ్ఛను రక్షించడానికి నైతిక విలువలను కాపాడడానికి 1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారికంగా ఏర్పాటు చేయబడిందని అప్పటినుండి ప్రతి ఏటా నవంబర్16న జాతీయ పత్రిక దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. పత్రిక స్వేచ్ఛకు ఎన్నో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయని అవన్నీ వ్యవస్థల ఆగడాలను ప్రశ్నిస్తున్నందునే జరుగుతున్నట్లు భావిస్తున్నామన్నారు. పత్రికా స్వేచ్ఛకు ఆటంకాలు కల్పించబడుతున్న సందర్భాలలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతుందని ప్రభుత్వ వ్యవస్థలో జరుగుతున్న ఆగడాలను అవినీతిని అక్రమాలను వెలికితీస్తూ నిజమైన జర్నలిజాన్ని నిర్వహిస్తున్న జర్నలిస్టులపై క్రూరమైన కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని మరోవైపు జర్నలిస్టుల హక్కుల రక్షణ కోసం సుప్రీంకోర్టు కఠినమైన తీర్పులు వెలువరిస్తున్న ప్పటికిని దేశంలో అవినీతి అక్రమాలు ఊహించని స్థాయిలో పెరిగిపోతున్నందున అవినీతి పరులు అక్రమార్కులు నిజాయితీగా పని చేస్తున్న జర్నలిస్టులకు రక్షణ లేకుండా చేస్తూ వాళ్ళ జీవితాలను నాశనం చేయడానికి తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. నిజాయితీని కాపాడుకోవడం కోసం అన్యాయాన్ని ప్రశ్నిస్తున్న సందర్భంలో అధికార వర్గాలకైతే నేమి రాజకీయ పాలకుల కైతేనేమి ఎక్కడ లేని కోపతాపాలు పెరిగిపోవడం జరుగుతున్నాయని అన్నారు.

పత్రికా స్వేచ్ఛ ఫలించాలి.

నిజాయితీగా పనిచేసే జర్నలిస్టుల జోలికి రావాలంటే అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టే విధంగా చట్టాల్లో మార్పులు సంభవించాలని ఆకాంక్షించారు. దేశంలో మీడియా వ్యవస్థ అదుపుతప్పుతుందని ప్రధాన మీడియా సంస్థలు రాజకీయాల వైపు వెళ్లినందున ప్రజలు మీడియాపై ఆసక్తి కోల్పోయి సత్యమైన సమాచారాన్ని గ్రహించడంలో మదన పడుతున్నారని అన్నారు. పత్రికా రంగానికి ప్రజలకు మధ్య ఉన్న సత్సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బ కొట్టడానికి ఒకవైపు ప్రభుత్వ అధికారులు మరోవైపు దేశపాలకులు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఒక ప్రభుత్వ అధికారి గర్వంగా పనిచేస్తున్న సందర్భంగా లక్షలాది మంది ప్రజలకు ఏ విధంగానైతే మేలు చేయగలరో ఒక జర్నలిస్టు మేధావి నిజాయితీగా పని చేయగలిగితే దేశంలోని 147 కోట్ల మంది ప్రజలకు దేశంలోని సత్యమైన సమాచారాన్ని చేరవేయగలడని గర్వంగా చెప్పగలమన్నారు. దేశవ్యాప్తంగా రక్షణ లేకుండా న్యాయపోరాటం కొనసాగిస్తున్నది కేవలం జర్నలిస్టు లేనన్న సంగతిని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలన్నారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర నిష్పక్షపాతంగా వార్తలు అందించడానికి పత్రిక స్వేచ్ఛను పత్రిక బాధ్యతను గుర్తు చేసుకోవడానికి నవంబర్ 16 వేదికగా నిలుస్తున్న సందర్భంలో నేటి పరిస్థితులలో పత్రిక స్వేచ్ఛ ఎంతగా నలిగిపోతుందో పత్రిక స్వేచ్ఛ ఎంతగా అణిచివేయబ డుతుందో ఒక్కసారిగా జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ నాయకులకు కావలసినంత రక్షణ అంగరక్షకుల రూపంలో లభిస్తుండగా ప్రభుత్వ అధికారులకు సిబ్బంది రూపంలో రక్షణ లభిస్తుండగా అవినీతిపరులకు అవినీతి రూపంలో సంపాదించు కుంటున్న పైసలతో ప్రైవేటు రక్షణ దారులను ఏర్పాటు చేసుకుంటూ సమాజంలో చలామణి అవుతుండగా అక్రమార్కులు అక్రమ వ్యాపారస్తులతో కావలసినంత రక్షణను సిద్ధపాటు చేసుకుంటుండగా కేవలం జర్నలిస్టులు మాత్రం ఏ విధమైనటువంటి వ్యక్తిగత రక్షణ లేకుండా పత్రిక స్వేచ్ఛపై ఆధారపడి మాత్రమే సమాజంలో జరుగుతున్న భయంకరమైన సన్నివేశాలను భయంకరమైన సంఘటనను భయంకరమైన అవినీతి, అక్రమాలను భయంకరమైన రాజకీయ పాలకుల పరిపాలనను దేశ ప్రజలకు తెలియజేయడం కోసం అహోరాత్రులు కష్టపడుతున్నారని తెలియజేశారు. పత్రికా స్వేచ్ఛ పట్ల అవగాహన కలిగిన ప్రతి ఒక్కరూ పత్రిక స్వేచ్ఛ ద్వారా లబ్ధి పొందుకుంటున్నారని అదే సందర్భంలో పత్రిక స్వేచ్ఛ ద్వారా ఇబ్బంది అనిపిస్తున్న ప్రతి ఒక్కరూ అవినీతి అక్రమాలను అంటిపెట్టుకుంటున్న టువంటి వారేనని గుర్తెరుగాలన్నారు.

పేదరికంలో ప్రాణాలు కోల్పోతున్నారు.

దేశంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతుందని వర్కింగ్ జర్నలిస్టుల హక్కులకు పూర్తిస్థాయిలో భంగం కలుగుతుండడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు వాళ్లను వెంటాడుతున్నాయని గుర్తు చేశారు. జర్నలిస్టు సంక్షేమానికి కట్టుబడి సహకరించాల్సిన దేశపాలకులు వాళ్లకు వాళ్లే మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకొని సాధారణ మీడియాను నిజాయితీగా పని చేస్తున్న మీడియా ప్రతినిధులను సమాజం దృష్టిలో చెడ్డవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తూ జర్నలిస్టుల మనోభావాలను పూర్తిస్థాయిలో దెబ్బతీస్తున్నారని అన్నారు. ప్రతి జర్నలిస్టు కార్మికుని స్థాయిలో పనిచేస్తారని గుర్తుచేస్తూ సమస్యల పట్ల నిజాయితీగా పోరాటం చేసే క్రమంలో ఎంతటి స్థాయి కలిగిన వాళ్లనైనా ఎదిరించడానికి వెనుకకు పోరని గుర్తుచేశారు. ఏ సామాజిక వర్గపు జర్నలిస్టులైతే సమాజంపై ఎక్కువ స్థాయిలో ప్రభావితం చూపిస్తారో అదే సామాజిక వర్గపు వ్యక్తులతో, రాజకీయపు శక్తులతో వాళ్లను అణిచివేసే కుట్రలు చేస్తున్నారని అది ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టమని అన్నారు. మరోవైపు ప్రతి రాష్ట్రంలో కష్టపడి పనిచేస్తున్న సాధారణ మీడియా సంస్థలకు రక్షణ కరువైపోయిందని ప్రభుత్వాలే కొత్త జీవోల రూపంలో మీడియా సంస్థలను తీవ్రస్థాయిలో అణిచి వేస్తున్నారని అన్నారు. ఒకవైపు కష్టాలను ఎదుర్కొని జీవితాలతో పోరాటం చేస్తూనే మరోవైపు ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సంసిద్ధమవుతున్న ప్రతి జర్నలిస్టు ఆర్థికపరమైన సమస్యలతో కొట్టుమిట్టాడుతు న్నారని అదే సందర్భంలో దేశంలో ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలతో రాయితీలు పొందుకుంటున్న పత్రిక సంస్థలు పత్రిక యాజమాన్యాలు ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలకు ఆశపడుతూ జర్నలిస్టు సంఘాల రూపంలో గ్రూపులుగా ఏర్పడి జేఏసీలుగా ఏర్పడి నిజమైన జర్నలిస్టులను ప్రభుత్వాలు దృష్టిలో పలుచన చేస్తున్నారని అన్నారు. జర్నలిజం అనేది ఎవరి సొత్తు కాదని ఎవరు ఎంత బలంగా ధైర్యంగా నిజాయితీగా ప్రజల కోసం ప్రజాస్వామ్య రక్షణ కోసం సమాజాన్ని కాపాడుకోవడం కోసం నిలబడగలుగుతారో వాళ్ళే నిజమైన జర్నలిస్టుగా గర్వంగా కాలర్ ఎగరేసుకొని తిరుగగలరని గమనించాల్సి ఉంటుందన్నారు. ప్రతి రాష్ట్రంలో నిరుపేదలైన జర్నలిస్టులకు ప్రభుత్వాలు సహాయపడాలని జర్నలిస్టు సంక్షేమల కొరకు ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులన్నీ ప్రభుత్వాల ద్వారా రాయితీలు పొందుకుంటున్న మీడియా సంస్థలకే చేరిపోతున్నాయని పేద జర్నలిస్టులు నిజాయితీగా పనిచేస్తున్నప్పటికిని మీడియా సంక్షేమల రూపంలో తగిన సహాయం లభించడం లేదని నిజాయితీగా ప్రస్తావించారు. జర్నలిజం అంటే ఒకని ముందు బానిసగా బ్రతికేది కాదని ప్రతి అవినీతిపరున్ని ప్రతి అక్రమార్కుల్ని బానిసలుగా చేసుకొని సమాజం ముందు దోషులుగా నిలబెట్టేదన్న సంగతిని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిందే అన్నారు. పేదరికాన్ని అనుభవిస్తూ నిజాయితీగా జర్నలిజం చేయడంలో ఉన్న గర్వకారణం మరి ఎందులో దొరకదని అది డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కుని అలాంటి హక్కులను రక్షించడం కోసం పేదవాడిగా పుట్టి పేదవాడిగా జీవిస్తూ పేదవాడిగా నిజాయితీ జర్నలిజం చేస్తూ పేదవాడిగా జీవితాలు చాలిస్తున్నప్పటికిని ఆత్మగౌరవంలో సమాజ రక్షణ కోసం పాటుపడడంలో ఉన్న ఆనందం ఆత్మ రక్షణ విషయంలో అంతులేని గర్వం అనే ఆస్తులను సంపాదించుకున్న వాళ్లంగా సమాజంలో నిలిచిపోగలమన్న సంగతిని గుర్తుచేసుకొని గర్వపడుతున్నామన్నారు.

పోలీస్ స్టేషన్ గ్రూపుల్లో పెత్తనం ఎవరిది?
మీడియా సమాచారానికి అడ్డుకట్ట ఎందుకు?

వాట్సాప్ గ్రూపులు కొందరి గుప్పిట్లోకి.. అడ్మిన్లదే
అంతా అన్నట్లుగా వ్యవహారం
క్రైమ్ వార్తలు ఎవరు పంపాలి? ఏ వార్త బయటకు
రావాలి? నిర్ణయించేది ఎవరు?
పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకుని పారదర్శక
వ్యవస్థకు శ్రీకారం చుట్టాలి

వరంగల్, (జై భీమ్ క్రైమ్ న్యూస్)

పోలీస్ శాఖకు సంబంధించిన సమాచారం ప్రజలకు, మీడియా ప్రతినిధులకు చేరవేయాల్సిన వాట్సాప్ గ్రూపులు కొందరి వ్యక్తిగత ఆధిపత్యానికి వేదికలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, క్రైమ్ ఘటనలు, అధికారిక ప్రకటనలు ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, కొన్ని పోలీస్ స్టేషన్ గ్రూపుల్లో మాత్రం భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ స్టేషన్ల పేర్లతో నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూపుల్లో కొందరు అడ్మిన్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే అసంతృప్తి పాత్రికేయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. పోలీస్ శాఖకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ సమానంగా చేరవేయాల్సిన గ్రూపుల్లో కొందరి పెత్తనం కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. గ్రూపులు అధికారిక సమాచార మార్పిడికి ఉపయోగపడాల్సి ఉండగా, కొందరు వ్యక్తులు వాటిని తమ వ్యక్తిగత నియంత్రణలో ఉంచుకుని వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా క్రైమ్ వార్తల విషయంలో ఈ పరిస్థితి మరింత చర్చకు దారితీస్తోంది. పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న నేర ఘటనలు, పోలీసులు చేపట్టిన దర్యాప్తులు, నిందితుల అరెస్టులు, కేసుల వివరాలు వంటి సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు చేరవేయడంలో ఏకపక్ష ధోరణి ఎందుకు కనిఎ స్తోందనే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. కొందరు వ్యక్తుల ద్వారానే వార్తలు వెళ్లాలి, వారే సమాచారాన్ని అందించాలి అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. అసలు పోలీస్ శాఖ అధికారిక సమాచారం పంపిణీలో వ్యక్తుల ఆధిపత్యానికి తావు ఉండాలా? మీడియాకు సమాచారం చేరవేయడం లో కొందరికే ప్రాధాన్యత ఇవ్వడం సమంజసమేనా? అనే ప్రశ్నలు పాత్రికేయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైనది. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం, ప్రభుత్వ శాఖల పనితీరును ప్రజల ముందుంచడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. అలాంటి మీడియా ప్రతినిధులకు పోలీస్ శాఖ నుంచి అందాల్సిన అధికారిక సమాచారం పారదర్శకంగా, వివక్ష లేకుండా అందుబాటులో ఉండాలి. అయితే కొందరు గ్రూప్ అడ్మిన్ల వ్యవహారశైలి కారణంగా సమాచార పంపిణీలో అసమానతలు ఏర్పడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ స్టేషన్ వాట్సాప్ గ్రూపులు ఎవరి వ్యక్తిగత ఆస్తులు కావు. అవి పోలీస్ శాఖకు సంబంధించిన సమాచార మార్పిడి వేదికలు మాత్రమే. గ్రూప్ అడ్మిన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు తమ పరిధిని గుర్తించి, శాఖాపరమైన నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అధికారిక సమాచారాన్ని తమకు నచ్చిన వారికి మాత్రమే చేరవేయడం, ఇతర మీడియా ప్రతినిధులను పక్కనపెట్టడం వంటి చర్యలకు అవకాశం లేకుండా స్పష్టమైన విధానం ఉండాలని పాత్రికేయులు కోరుతున్నారు. అలాగే పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే క్రైమ్ ఘటనలకు సంబంధించిన సమాచారాన్ని అధికారికంగా ఎవరు విడుదల చేయాలి? మీడియా ప్రతినిధులకు సమాచారం అందించే బాధ్యత ఎవరిది? గ్రూప్ అడ్మిన్ల అధికారాలు, బాధ్యతలు ఏమిటి? అనే అంశాలపై పోలీస్ శాఖ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. సమాచార పంపిణీకి సంబంధించి ఒకే విధమైన మార్గదర్శకాలు అమలు చేస్తే అనవసర వివాదాలకు, అపోహలకు తావుండదని పలువురు అభిప్రాయపడుతున్నారుఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని పాత్రికేయ వర్గాలు కోరుతున్నాయి. పోలీస్ స్టేషన్ వాట్సాప్ గ్రూపుల నిర్వహణపై సమీక్ష నిర్వహించి, గ్రూప్ అడ్మిన్ల వ్యవహారశైలిని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. పోలీస్ శాఖకు సంబంధించిన అధికారిక సమాచారం మీడియా ప్రతినిధులందరికీ సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని, వ్యక్తిగత పెత్తనానికి తావులేకుండా పారదర్శక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పోలీస్ శాఖ ప్రజలకు జవాబుదారీగా పనిచేసినట్లే, మీడియాకు సమాచార పంపిణీలోనూ పారదర్శకత పాటించాలి. గ్రూప్ అడ్మిన్లే నిర్ణయాధికారులుగా వ్యవహరించే పరిస్థితులకు ముగింపు పలికి, పోలీస్ శాఖ గౌరవం, మీడియా స్వేచ్ఛ, ప్రజల సమాచార హక్కు పరిరక్షించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



అన్ని రంగాల్లో సాధికారతే జయశంకర్ ఆకాంక్షించిన తెలంగాణ





డా. కె. శ్రీనివాస్

కేయూ క్యాంపస్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర సాధనకు మేధోపరమైన, తాత్విక మార్గదర్శనం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని ప్రముఖ పాత్రికేయుడు, సామాజిక రాజకీయ విశ్లేషకుడు డా. కె. శ్రీనివాస్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో సోమవారం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డా. కె. జయశంకర్ 14వ స్మారక ఉపన్యాసంలో 'సాధనానంతర తెలంగాణ: సార్ దృక్పథం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాస్ మాట్లాడుతూ, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదన్నారు. సమాన అభివృద్ధి, సామాజిక సాధికారత, అధికార వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్థానిక సంస్థలకు తగిన అధికారాలు, నిధులు కల్పించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన్నారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, అస్తిత్వం, సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సభకు అధ్యక్షత వహించిన ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్య, పరిశోధనలతో పాటు సమాజ అభివృద్ధికి విశ్వవిద్యాలయాలు కృషి చేయాలన్న ఆయన ఆలోచనలు భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం విద్యార్థులు ఇలాంటి స్మారక ఉపన్యాసాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్ట్ బాధ్యులు డా. బండ ప్రకాశ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 14 స్మారక ఉపన్యాసాలు నిర్వహించామని, జయశంకర్ పేరిట గోల్డ్ మెడల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆచార్య ఎ. శంకరయ్య జయశంకర్ దార్శనికత, పరిపాలనా దక్షతను కొనియాడారు.కార్యక్రమంలో తొలుత మాజీ ఉపకులపతి ఆచార్య ఎన్. లింగమూర్తి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ముఖ్య వక్త డా. కె. శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, పాలకమండలి సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రజా సంబంధాల అధికారి డా. పృథ్వీరాజ్ వల్లాల సమన్వయకర్తగా వ్యవహరించారు.


ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి దేవస్థానం పురాతన కోనేరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌కు జన్ను కిషన్ కుమార్ వినతి



హన్మకొండ, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పురాతన కోనేరు (మెట్టుబావి) అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని హసన్‌పర్తి గ్రామానికి చెందిన జన్ను కిషన్ కుమార్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నవంబర్ 16న అత్యవసర ప్రజా ప్రయోజన అభ్యర్థన కింద గ్రీవెన్స్ సెల్ ద్వారా వినతిపత్రం సమర్పించారు. గతంలో మార్చి 23, 2026న హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఇదే అంశంపై వినతిపత్రం అందజేయగా, కలెక్టర్ సంబంధిత అధికారులకు సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ సూచనల మేరకు అధికారులు స్పందించి పురాతన కోనేరు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ పనుల్లో సంబంధిత అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సురేందర్ తదితరులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. అయితే కోనేరు పూర్తిస్థాయి అభివృద్ధి పనులు ఇంకా చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారని, సుమారు ఐదు రోజుల పాటు శ్రమించి కోనేరు పరిసరాలను శుభ్రం చేసినప్పటికీ, శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కావున సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కోనేరు అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలు (ఎస్టిమేట్లు) తయారు చేయించి, అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. పురాతన కోనేరును పునరుద్ధరించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేవస్థానం అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి పురాతన ఆధ్యాత్మిక సంపదను కాపాడాలని జన్ను కిషన్ కుమార్ కోరారు.



తేదీ: 16-11-2026

శ్రీయుత గౌరవనీయులైన కమిషనర్ గార్కి,
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, వరంగల్.

// అత్యంత ప్రజాప్రయోజన అభ్యర్థన. గ్రీవెన్స్ సెల్ ద్వారా //

విషయము:- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన కోనేరు (మెట్టబావి) అభివృద్ధికి నిధులు మంజూరి చేయుటకు అభ్యర్థన.
రెఫరెన్సు:- శ్రీయుత జిల్లా కలెక్టర్ హనుమకొండ గార్కి గ్రీవెన్స్‌సెల్ ద్వారా తేది: 23-3-2026న చేసుకున్న అభ్యర్థన.
-0-

ఆర్య!

నై విషయానుసారము తమతో మనవి చేయునది ఏమనగా...నై రెఫరెన్సు ద్వారా మేము చేసుకున్న అభ్యర్థనమ జిల్లా కలెక్టర్ గారు తమరికి రెఫర్ చేయగా మీరు తీసుకున్న చర్యలకు కృతజ్ఞతలు. మీరు స్పందించి ఆన్యాక్రాంతానికి గురౌతున్న పురాతన కోనేరు (మెట్ల బావి) ని అధికారులతో దర్శన్ చేయించి శ్రీమతి చంద్రకళ ఎఇ గారు. & వర్క్‌ఇన్‌స్పెక్టర్ అశోక్ మరియు సురేందర్ గార్లు మోకాపీదకు వచ్చి తక్షణ చర్యలు తీసుకొని చెట్ల పొదలు తొలగించి బావిని అన్యాక్రాంతం కాకుండా కాపాడారు.

కాని ఇట్టి బావికి పూడక తీయించి పునర్నిర్మాణం చేయుటకుగాను తమ శాఖకు సంబంధించిన ఇంజనీర్ల ద్వారా ఎస్టిమేట్ చేయించి నిధులు మంజూరి చేయుటకు వేడుకొను చున్నాము.

ప్రతి సంవత్సరం వేల మంది భక్తులతో పెరూ పౌర్ణమి నుండి 5 రోజుల మహా జాతర జరుగుతుంది. చాలా సంవత్సరాలుగా ఇట్టి కోనేరు నిరాదరణకు గురై భక్తులకు స్నానమాచరించే వీలు లేకుండా పోయింది. పైగా మీరు తీసుకున్న చర్యల వలన ఇట్టి దేవస్థానమునకు చెందిన కోనేరు బావి ఇతరులు అన్యాక్రాంతం కాకుండా కాపాడారు.

కాని దయచేసి వేల భక్తుల అభ్యర్థనగా మా విన్నపాన్ని మన్నించి నిధులు మంజూరి చేసి ఈ బావిని పునఃనిర్మాణం చేస్తే భక్తజనం హర్షిస్తారు. దయతో తమరి తక్షణ చర్యకై ఎదురుచూస్తూ....
దేవస్థానం అభివృద్ధే ధ్యేయంగా స్వామివారి సేవలో....

J.K.
(జన్ను కిషన్‌కుమార్)
గ్రామం & మం: హనుమకొండ.
జిల్లా: హనుమకొండ.
సెల్: 9494787800

పిల్లల ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి -డాక్టర్ అనితా రెడ్డి



హన్మకొండ నవంబర్ 16/2026(జై భీమ్ న్యూస్)

హన్మకొండ రెడ్డి కాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్ లో చిల్డ్రన్స్ డే వేడుకలు పాఠశాల చైర్మన్ మల్లాడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రాండ్‌మాస్టర్ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, పాఠశాల విద్యార్థిని కుమారి బోయిని యశికా, మానవ శరీరంలోని అన్ని భాగాల పేర్లను ఒక నిమిషం కంటే తక్కువ సమయంలో ఏకధాటిగా ఉచ్ఛరించి తన అసాధారణ జ్ఞాపకశక్తిని ప్రదర్శించినందుకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుండి 2026 సంవత్సరానికి గ్రాండ్‌మాస్టర్ హోదాను పొందడం జరిగింది ఇది డాక్టర్ అనితా రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.బాలలందరికీ సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, రక్షణ కల్పించడంతో పాటు వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. బాలల భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి పిల్లలకి సురక్షితమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించేందుకు ప్రభుత్వ శాఖలు, పాఠశాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. బాలల అభివృద్ధి, సంక్షేమం, విద్యాభివృద్ధి, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు ఆవిష్కృత మవుతాయన్నారు, చిన్నారి యశికా విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు, అనంతరం పిల్లలకు నిర్వహించిన ఆటల, పాటలు, డాన్స్ పోటీలలో గెలుపొందిన బాలలకు బహుమతులు అందజేశారు,పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి ఈ కార్యక్రమంలో డా. కె. అనితా రెడ్డి , పాఠశాల చైర్మన్ మల్లాడి ప్రభాకర్ రెడ్డి, బోయినపల్లి మహేష్ రావు ,రఘు తల్లిదండ్రులు, టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు. – డాక్టర్ అనితా రెడ్డి, అనురాగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.



హసన్‌పర్తిలో ఇంటింటికీ పోలీస్.. నేరాల నియంత్రణపై విస్తృత అవగాహన

సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలి -- ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్



హసన్‌పర్తి, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఆదర్శ్ నగర్ కాలనీలో ఇంటింటికీ పోలీస్ (డోర్ టు డోర్ కమ్యూనిటీ కనెక్ట్) కార్యక్రమాన్ని సోమవారం విస్తృతంగా నిర్వహించారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది కాలనీలోని ప్రతి ఇంటిని సందర్శించి స్థానికులతో నేరుగా మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ నేరాల నియంత్రణ, వ్యక్తిగత భద్రత, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, లాటరీల పేరుతో వచ్చే నకిలీ లింకులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అలాగే చట్టాన్ని అమలు చేసే అధికారుల పేరుతో కొందరు వ్యక్తులు ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న డిజిటల్ అరెస్ట్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇలాంటి అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. కాలనీలలో దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలనీలలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తక్షణ పోలీస్ సహాయం పొందేందుకు 112 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించుకోవాలని వివరించారు. ఏదైనా ఆపద ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పోలీసులకు తమ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆదర్శ్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 92 ఫిర్యాదులు.. పరిష్కారంపై కమిషనర్ ఆదేశాలు

వసూలైన పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు 24 గంటల్లో ఖజానాకు జమ చేయాలి



గ్రేటర్ వరంగల్ , నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 92 ఫిర్యాదులు అందాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కమిషనర్ టి. వెంకన్న, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు వసూలు చేసిన మొత్తాలను ఎట్టి పరిస్థితుల్లోనూ 24 గంటల్లోగా మున్సిపల్ ఖజానాలో జమ చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల పన్నుల రూపంలో వసూలైన నగదును ఖజానాలో జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించిన ఘటన నేపథ్యంలో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.ప్రతి రోజు వసూళ్లు, ఖజానాలో జమ చేసిన మొత్తాలను అధికారులు పరిశీలించాలని, ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటివరకు వసూళ్లు, బకాయిలు, జమల వివరాలను డివిజన్ల వారీగా సేకరించి పది రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు.అందిన 92 ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ విభాగానికి 44, ఇంజినీరింగ్‌కు 28, రెవెన్యూకు 8, హెల్త్ అండ్ శానిటేషన్‌కు 7, నీటి సరఫరాకు 4, హార్టికల్చర్ విభాగానికి ఒక ఫిర్యాదు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సమ్మయ్య, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

అధికారులను ఆదేశించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యతనిస్తూ బాధితులకు న్యాయం చేయాలని, శాఖల వారీగా అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఏ శాఖకు సంబంధించిన అర్జీలు ఆ శాఖలోనే పెండింగ్‌లో ఉండకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 293 అర్జీలు అందాయి. ఇందులో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో 162 అర్జీలు, ఆర్డీవో కార్యాలయాల్లో 20 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో 111 అర్జీలను అధికారులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి శాఖలో ఉద్యోగుల హాజరు నమోదుకు మీప్రమాణం యాప్ ద్వారా ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ కార్యాలయ పరిధిలో మొబైల్ ఫోన్ ద్వారా ప్రతిరోజూ హాజరు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ దుర్వినియోగంతో భవిష్యత్తులో సాధారణ వ్యాధులకూ ముప్పు

మందుల వినియోగంలో బాధ్యత అవసరం.. ఫార్మసిస్టులదే కీలక పాత్ర

జానపరెడ్డి కృష్ణవేణి, ఆచార్య గాదె సమ్మయ్య



జనగామ, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచనలు లేకుండా వినియోగించడం వల్ల ఔషధ నిరోధకత పెరిగి భవిష్యత్తులో సాధారణ ఇన్ఫెక్షన్లకు సైతం చికిత్స చేయడం కష్టతరమవుతుందని ప్రముఖ అధ్యాపకులు జానపరెడ్డి కృష్ణవేణి, మాజీ డీన్ ఆచార్య గాదె సమ్మయ్య అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం జనగామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో యాంటీబయాటిక్ నిరోధకత, ఔషధాల బాధ్యతాయుత వినియోగం, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సరైన ఔషధాన్ని, సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన వ్యక్తికి అందించినప్పుడే చికిత్స ఫలవంతమవుతుందని వివరించారు. వైద్యుల సూచనల మేరకు మాత్రమే యాంటీబయాటిక్స్ వినియోగించాలని, చికిత్సను మధ్యలో నిలిపివేయకూడదని సూచించారు. ముఖ్యంగా క్షయవ్యాధి వంటి వ్యాధుల్లో ఔషధ నిరోధకతను నివారించేందుకు నిర్ణీత చికిత్సను పూర్తిచేయడం అవసరమన్నారు. ఫార్మసీ విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రయోగశాల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఔషధ పరిశోధనల్లో ఆసక్తి చూపాలని సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అర్హత లేని వ్యక్తులు మందుల విక్రయాలు, వైద్య సేవలు అందించడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు, క్లినికల్ ఫార్మసిస్టులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఆరోగ్య సేవలు అందించవచ్చని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, టీకాల ప్రాధాన్యతను గుర్తించడం, మిగిలిపోయిన యాంటీబయాటిక్స్‌ను సొంతంగా వినియోగించకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ లవకుమార్ రెడ్డి, అధ్యాపకులు, ఫార్మసీ విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. యాంటీబయాటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించి వాటి ప్రభావాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేయాలి





రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సందడి నింపాలి - మంత్రి వాకిటి శ్రీహరి

కలెక్టరేట్లలో కౌంట్‌డౌన్ బోర్డులు, ప్రధాన కూడళ్లలో మస్కట్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలి

ములుగు, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026ను విజయవంతం చేయాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సందడి నెలకొనేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, యువజనాభివృద్ధి, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 20 వేదికలపై వివిధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి గర్వకారణమని, ఈ క్రీడా వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అధికారిక లోగో, మస్కట్‌ను ముఖ్యమంత్రి న్యూఢిల్లీలో ఆవిష్కరించిన నేపథ్యంలో అన్ని జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. క్రీడలు జరిగే జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల్లోనూ ప్రజలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేసి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, పార్కులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అధికారిక లోగో, మస్కట్‌తో కూడిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కలెక్టరేట్లలో కౌంట్‌డౌన్ బోర్డులు, ప్రధాన కూడళ్లలో మస్కట్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా యువజన, క్రీడల అధికారి ధర్మానాయక్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాలల భద్రతే లక్ష్యం.. అక్రమ రవాణా, బాల్యవివాహాలపై పోలీసుల ఉక్కుపాదం! : ఎస్ఐ సుజిత్

బాలల హక్కుల పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలి

హసన్‌పర్తి, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, బాలల హక్కుల పరిరక్షణ, అక్రమ రవాణా, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీసులు పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలాన్ని బాలలకు సురక్షితమైన మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో బాలల హక్కుల వారోత్సవాల ప్రచార రథాన్ని పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ సుజిత్ జెండా ఊపి ప్రారంభించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఆధ్వర్యంలో, మండల కోఆర్డినేటర్, వారోత్సవాల కన్వీనర్ ఈసంపల్లి సుదర్శన్ పర్యవేక్షణలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బాలల హక్కులు, రక్షణ, సంరక్షణపై గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ప్రతి బాలుడు, బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే ప్రచార రథం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ సబ్‌ఇన్స్పెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్యవివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. డబ్బు సంపాదన, ఉద్యోగాలు, సినిమా అవకాశాలు, ఇతర ఆకర్షణీయమైన హామీలతో అమాయక ప్రజలను మోసం చేసి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా ముఠాలు అవయవాల దోపిడీ, లైంగిక దోపిడీ, బలవంతపు పనుల వంటి అక్రమాలకు పాల్పడుతున్నాయని, ఇలాంటి ఘటనలు ఎక్కడైనా గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, ఆపద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. హసన్‌పర్తి మండలాన్ని ఉత్తమ, ఆదర్శ, సురక్షిత మండలంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 181, 1098, 1930 టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా ఉచిత సహాయం పొందవచ్చని విద్యార్థులకు వివరించారు. అనంతరం వరంగల్‌కు చెందిన సందీప్ కళాబృందం జానపద గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా బాలల హక్కులు, బాల్యవివాహాల దుష్పరిణామాలు, మానవ అక్రమ రవాణా, బాలల సంరక్షణ, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించింది. పాటల రూపంలో సామాజిక సందేశాలను అందిస్తూ విద్యార్థులతో బాలల హక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. బాలల భద్రత కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పిల్లలకు రక్షణ కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని కళాబృందం సభ్యులు తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుజిత్, ఎస్ఐ పాపయ్య, ఎస్ఐ నగేష్, ఎస్ఐ సిరాజ్, పోలీసు సిబ్బంది గీత, రామారావు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ సుధాకర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సతీష్, బాలికల పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు భారతి, సందీప్ కళాబృందం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చేయూత పెన్షన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

వరంగల్ । నవంబర్ 16 । జై భీమ్ న్యూస్

వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో మంగళవారం నిర్వహించనున్న చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.ఎల్బీనగర్‌లోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా వేదిక, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్ వంటి సౌకర్యాలను సిద్ధం చేయాలని, వృద్ధులు, దివ్యాంగులు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో ఉప కమిషనర్ ప్రసన్నరాణి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సంజయ్ కుమార్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హన్మకొండ, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లాలో నవంబర్ 22న నిర్వహించనున్న సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్ డే (పల్స్ పోలియో) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. జిల్లాలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో సిబ్బందిని సమన్వయం చేసి, కార్యక్రమానికి ఒకరోజు ముందుగానే టామ్‌టామ్ (దండోరా) ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్‌చైన్ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు విధిగా కార్యక్రమంలో పాల్గొనేలా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయాలని, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. నవంబర్ 22న జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 23, 24 తేదీల్లో పోలియో బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి, మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు మొత్తం 84,654 మంది ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. వీరందరికీ పోలియో చుక్కలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 497 పల్స్ పోలియో బూత్‌లు, 12 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, ఒక పీపీపీ యూనిట్ ద్వారా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రామకాంత్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ సౌమ్య నాయక్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీకృష్ణారావు, డాక్టర్ రజిత, డాక్టర్ మురళి, డాక్టర్ జ్ఞానేశ్వర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్, రోటరీ క్లబ్ బాధ్యులు, మాస్ మీడియా అధికారి ప్రసాద్, సునీల్ జయంత్, తాహిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.




అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎల్కతుర్తిలో నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ
మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మంత్రులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నూతన పింఛన్ల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి ప్రతి అక్కాచెల్లెలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీరిలో 2,77,894 మంది వితంతువులు, 1,00,224 మంది దివ్యాంగులు, 27,444 మంది గీత కార్మికులు, 4,451 మంది చేనేత కార్మికులు, 53,844 మంది ఒంటరి మహిళలు ఉన్నారని వివరించారు. ఎల్కతుర్తి మండలంలో ఇప్పటికే 5,850 మందికి నెలవారీ పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 715 మందికి కొత్తగా మంజూరు చేశామని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 5,230 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అర్హులైన ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకూడదని, పింఛన్ల పరిశీలనలో లోపాలు ఉంటే ప్రత్యేక అధికారులతో సమగ్రంగా పరిశీలిస్తామని తెలిపారు. ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 18 ఏళ్లు నిండిన కోటి మంది మహిళలకు చిలుకపచ్చ రంగు చీరలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని వృత్తుల వారికి వర్తించేలా ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా పథకాన్ని కూడా ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎల్కతుర్తి మండలంలో దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయక ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లు, చేతికర్రలు, ఎలక్ట్రిక్ వాహనాలు, వినికిడి యంత్రాలను అర్హులకు ఉచితంగా అందిస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి శుభకార్యాల్లో మహిళా సంఘాల స్టీల్ ప్లేట్లను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. రాబోయే వేసవి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రైతులు పొలాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాకతీయుల గొలుసుకట్టు చెరువుల స్ఫూర్తితో గ్రామాల్లో చిన్న ఊటకుంటలు నిర్మించుకోవాలని అన్నారు. నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. యువత గంజాయి, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో కోర్టులు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. చిన్న గ్రామాలకు రూ.లక్ష, పెద్ద గ్రామాలకు రూ.2 లక్షల చొప్పున క్రీడా అభివృద్ధి నిధులు అందిస్తున్నామని, త్వరలో హుస్నాబాద్ కబడ్డీ అకాడమీని ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎల్కతుర్తి చౌరస్తా అభివృద్ధి చేశామని, త్వరలో నూతన బస్టాండ్ నిర్మాణం చేపడతామని, ఎల్కతుర్తి ఆసుపత్రి విస్తరణతో పాటు మణికొండ రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, తలసేమియా బాధితులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసి పంపిణీ ప్రారంభించామని తెలిపారు. ఈ విడతలో దాదాపు 4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా మరో అవకాశం కల్పిస్తామని చెప్పారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న మరో 13 వేల మంది వివరాలను కూడా పరిశీలిస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, తలసేమియా బాధితులైన పురుష పింఛన్‌దారులు మరణిస్తే వారి భార్యలకు ఒకటి రెండు నెలల్లోనే పింఛన్ మంజూరయ్యేలా కొత్త జీవో తీసుకొచ్చామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు రూ.75 వేల కోట్ల రుణాలు మంజూరు చేశామని చెప్పారు. మహిళా సంఘాలకు ఎలాంటి తాకట్టు లేకుండా రుణాలు అందిస్తున్నామని, వడ్డీ మొత్తాన్ని ప్రతి మూడు నుంచి ఆరు నెలలకు ఒకసారి నేరుగా సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి పథకాలను కుటుంబంలోని మహిళల పేర్లపై అందిస్తున్నామని పేర్కొన్నారు. 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం ద్వారా 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు అక్షరజ్ఞానం అందించామని, ఆసక్తి ఉన్నవారికి పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కిరాణా దుకాణాలు, బట్టల షాపులు, మొబైల్ వాహనాల ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మేడారం జాతరలో మహిళా సంఘాలు రూ.3 కోట్ల రుణాలతో వ్యాపారాలు నిర్వహించి రూ.6 కోట్ల వరకు ఆదాయం ఆర్జించాయని చెప్పారు. కలెక్టరేట్లు, మండల కార్యాలయాలు, హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంతాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,800కు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని, గత ఏడాది వీటి ద్వారా రూ.168 కోట్ల కమీషన్ ఆదాయం సంపాదించారని వెల్లడించారు. ప్రతి మండల సమాఖ్యకు రూ.30 లక్షల సబ్సిడీతో బస్సులు అందిస్తున్నామని, వాటికి నెలకు రూ.70 వేల చొప్పున ప్రభుత్వం అద్దె చెల్లిస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులు అనారోగ్యంతో మరణిస్తే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని, గత ఏడాది ఐదు వేల మంది సభ్యుల రుణాలను మాఫీ చేశామని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, కుటుంబ పెద్ద మరణిస్తే ఇందిరా జీవిత బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాల కోసం హైటెక్ సిటీ సమీపంలో రూ.1,000 కోట్ల విలువైన 106 షాపులను కేటాయించామని, గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తున్నామని వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.200 కోట్లు మంజూరు చేశామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రులు స్పష్టం చేశారు.



కిట్స్‌లో ఏఐసీటీఈ-ఏటీఏఎల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం





వరంగల్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

వరంగల్ కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ--ఏటీఏఎల్ ఒక వారం పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. స్మార్ట్ వ్యవసాయం, రియల్‌టైమ్ అప్లికేషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ సాంకేతికత వినియోగంపై నవంబర్ 16 నుంచి 21 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కిట్స్ నూతన సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ కె. కిషోర్, విశిష్ట అతిథిగా డెలాయిట్ సీనియర్ డేటా సైంటిస్ట్ డాక్టర్ అక్కెం యాగంతీశ్వరులు హాజరయ్యారు. కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. కిషోర్ మాట్లాడుతూ ఐఓటీ సెన్సార్లు, డీప్ లెర్నింగ్ సాంకేతికతను వ్యవసాయ రంగంలో వినియోగించడం ద్వారా పంటల ఆరోగ్యాన్ని గుర్తించడం, నేల తేమను పర్యవేక్షించడం, పంట తెగుళ్లను ముందుగానే గుర్తించడం సాధ్యమవుతుందని తెలిపారు. డాక్టర్ అక్కెం యాగంతీశ్వరులు మాట్లాడుతూ ఎంవీక్యూటీటీ, హెచ్‌టీటీపి, కోఏపీ వంటి ఐఓటీ కమ్యూనికేషన్ విధానాలు, ఈఎస్‌పీ8266, ఈఎస్‌పీ32, రాస్‌బెర్రీ పై పరికరాల వినియోగంపై వివరించారు. ఏఐ మానవుల భావోద్వేగ మేధస్సు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని భర్తీ చేయలేదని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో సీఎస్ఈ విభాగం రూ.64 లక్షల విలువైన డీఎస్‌టీ ప్రాజెక్టులను సాధించిందని తెలిపారు. ఈ ఎఫ్‌డీపీ ద్వారా తక్కువ కంప్యూటింగ్ సామర్థ్యం కలిగిన పరికరాలతో స్మార్ట్ వ్యవసాయ వ్యవస్థలను రూపొందించే పరిజ్ఞానం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి. నిరంజన్ కోఆర్డినేటర్‌గా, డాక్టర్ ఎం.డి. షర్ఫుద్దీన్ వసీమ్ కో-కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రఘురామ్, డాక్టర్ చింతకింద శ్రీనివాస్, డాక్టర్ పి. విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎన్.సి. సంతోష్ కుమార్, బి. ధాత్రి తదితరులు పాల్గొన్నారు. వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది హాజరయ్యారు. కిట్స్ మాజీ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, ట్రెజరర్ పి. నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఎఫ్‌డీపీ నిర్వహణపై సీఎస్ఈ విభాగం అధ్యాపకులను అభినందించారు.

చేయూత నూతన పెన్షన్ల పంపిణీ సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్ సత్య శారద





వరంగల్, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

సంగెం, గీసుగొండ మండలాల పరిధిలోని స్టేషన్ చింతలపల్లి వద్ద ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పైలాన్ ప్రాంతంలో బుధవారం నిర్వహించనున్న చేయూత ఆసరా నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ సభా ఏర్పాట్లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం పరిశీలించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా నూతనంగా మంజూరైన చేయూత ఆసరా పెన్షన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్న నేపథ్యంలో సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక, ప్రాంగణం, లబ్ధిదారులు, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతి, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సభకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సభను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పెన్షన్ లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్యక్రమంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జడ్పీ సీఈఓ వసంత, గీసుగొండ మండల తహసీల్దార్ రియాజుద్దీన్, సంగెం మండల తహసీల్దార్ రాజ్‌కుమార్, గీసుగొండ ఎంపీడీవో రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem
సామాన్యుడి ఆయుధంగా

నిరుపేద మెడికో విద్యార్థికి మాస్ సంస్థ ఆర్థిక చేయూత

నీట్‌లో ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు..
రఘు వంశీకి రూ.20 వేల ఆర్థిక సహాయం



తొర్రూరు । నవంబర్ 16 । జై భీమ్ న్యూస్

నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక అండగా నిలవడమే లక్ష్యంగా మహా ఆది సేవా సమితి (మాస్) సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన తొర్రూరు మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన గూడెల్లి రఘు వంశీకి సంస్థ రూ.20 వేల ఆర్థిక సహాయం అందించింది.ఈ సందర్భంగా తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, మాస్ సంస్థ సభ్యులు డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సంస్థ కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకొని సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.గత ఐదేళ్లుగా దాతలు, మాదిగ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తల సహకారంతో మాస్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఉన్నత విద్య కోసం సుమారు రూ.55 లక్షల ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. తొర్రూరు ప్రాంతంలోనే ఇప్పటివరకు సుమారు రూ.2 లక్షలు విద్యార్థుల కోసం ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ అలువాల విజయ్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సామాజిక కార్యకర్త రాయిశెట్టి యాకేందర్, మాస్ సభ్యులు మంగళపెల్లి బాలాజీ, చిలుక మల్లేష్, మంగళపెల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 188 అర్జీలు.. పరిష్కారంపై కలెక్టర్ ఆదేశాలు


పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి..
అధికారులకు కలెక్టర్ సత్య శారద సూచన



వరంగల్ । అక్టోబర్ 26 । జై భీమ్ న్యూస్

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 188 అర్జీలను స్వీకరించారు.వీటిలో రెవెన్యూ శాఖకు 63, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 27, డీఆర్‌డీఓకు 18, గృహ నిర్మాణ శాఖకు 14, ఉపాధి శాఖకు 13, వ్యవసాయ శాఖకు 12 అర్జీలు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి మరో 41 అర్జీలు స్వీకరించారు.ప్రతి అర్జీని ప్రత్యేకంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ దరఖాస్తులు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా, అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్ కుమార్, వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత, హౌసింగ్ పీడీ విష్ణువర్ధన్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

శ్రీ గౌతమి గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగం పోటీలు





రాజమహేంద్రవరం, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శ్రీ గౌతమి ప్రాంతీయ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థినీ, విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కంచుమర్తి జగన్నాథరావు ఆధ్వర్యంలో నాలుగు రౌండ్లుగా పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేశారు. విజేతలకు నవంబర్ 20న నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారిణి ఘంటా శ్రీదేవి తెలిపారు. చదరంగం వంటి మేధోపరమైన ఆటలు విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తి, వ్యూహాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన కంచుమర్తి జగన్నాథరావును శాలువా, ఫ్రూట్ బొకే, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా, నవంబర్ 17న గ్రంథాలయంలో పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. అలాగే 'గాంధీజీ జీవిత చరిత్ర' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి తెలిపారు. విద్యార్థులు, పుస్తకాభిమానులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

స్కానింగ్ కేంద్రాలపై జిల్లా స్థాయి కమిటీ సమీక్ష..
నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష, జరిమానా



వరంగల్, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లా కోర్టు సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి పి.సి.పి.ఎన్.డి.టి. అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన, జిల్లా జడ్జి నిర్మల గీతాంబ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అనుమతుల మంజూరుపై చర్చించారు. అదేవిధంగా పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల పనితీరుపై సమీక్షించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలోని ఏ స్కానింగ్ కేంద్రంలోనూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. గర్భస్థ శిశువు ఆడపిల్లా, మగపిల్లాడా అనే విషయాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఆడ, మగ అనే వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమాన దృక్పథంతో వ్యవహరించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఎవరూ కోరరాదని, అటువంటి చర్యలను ప్రోత్సహించరాదని సూచించారు.పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం--1994 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, పిండం లింగాన్ని వెల్లడించినా నేర తీవ్రతను బట్టి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 వేల వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ పర్యవేక్షించాలని సూచించారు."ఆడపిల్లలను పుట్టనిద్దాం -- బ్రతకనిద్దాం -- చదివిద్దాం" అనే నినాదంతో బాలికల పట్ల వివక్షను విడనాడాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆడపిల్లల రక్షణ, అభివృద్ధి, విద్యకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఏసీపీ అంకిత్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, ఆర్డీఓ టి. సుమ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాజిదా తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ మున్సిపాలిటీలో మహాముదురులు..

ప్రజాసేవ ముసుగులో వ్యాపార పైరవీలు!
వ్యవస్థ బాగోగులకన్నా వ్యక్తిగత అభివృద్ధికే పెద్దపీట..
అధికారులను మచ్చిక చేసుకుని వ్యాపార లావాదేవీలకు తెరతీస్తున్నారా?
ఆధిపత్యం కోసం ఆరాటం.. వ్యాపారాల కోసం పరుగులు.
కులాధిపత్యం ముసుగులో దళారీ వ్యవహారాలు!
మున్సిపాలిటీ చుట్టూ బ్రోకర్ పైరవీలపై పోలీసు నిఘా ఏది?
కమిషనర్ ఎదుట మాటల గారడీ..
తెరవెనుక పైరవీల పర్వం!
ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ..
మేధావుల ముసుగులో వ్యవస్థకు శాపంగా మారుతున్నారా?



వరంగల్ । నవంబర్ 16 । జై భీమ్ న్యూస్

మహానగర అభివృద్ధి కోసం పనిచేయాల్సిన కొందరు వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులతో సాన్నిహిత్యం పెంచుకుని, వారి పేరుతో వ్యాపార వ్యవహారాలు, పైరవీలు నడిపిస్తున్నారనే ఆరోపణలు మున్సిపల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రజా సమస్యల పరిష్కారం, నగర అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో ఆధిపత్య పోరు, వ్యాపార ప్రయోజనాల కోసం కొందరు పరుగులు తీస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కులాధిపత్యం, పలుకుబడి ముసుగులో దళారీ వ్యవహారాలకు తెరలేపుతున్నారా? అధికారుల వద్ద ఒక రకంగా, తెరవెనుక మరో రకంగా వ్యవహరిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ ఎదుట హాస్యచతురతతో మాటలు కలుపుతూ నమ్మకం సంపాదించి, అదే పలుకుబడిని వ్యక్తిగత వ్యాపారాలు, పైరవీలకు ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలపై సమగ్ర పరిశీలన అవసరం. ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన గొంతులే వ్యక్తిగత ప్రయోజనాల ముందు మౌనంగా మారితే ప్రజాస్వామ్యానికి అర్థమేముంటుంది? నిజంగా ప్రశ్నించే వారిని నిరుత్సాహపరుస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపే సత్తువను నీరుగారుస్తున్నారనే ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది. మేధావులమని చెప్పుకునే కొందరి వ్యవహారశైలి మున్సిపల్ వ్యవస్థకే శాపంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ పైరవీల వెనుక ఎవరున్నారు? అధికారుల అండదండలు ఉన్నాయా? వ్యాపార ప్రయోజనాల కోసం మున్సిపల్ కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకుంటున్నారా? అన్న అంశాలపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మున్సిపాలిటీ చుట్టూ సాగుతున్న బ్రోకర్ వ్యవహారాలపై పోలీసు నిఘా, అధికారిక విచారణ ఉండాలి. ప్రజాసేవ పేరుతో వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలకు సంబంధించి నిజానిజాలు వెలుగులోకి రావాలి. ఎందుకంటే మున్సిపాలిటీ ఎవరి వ్యక్తిగత సామ్రాజ్యం కాదు.. అది ప్రజల ఆస్తి, ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థ!

కాజీపేట ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.. 44 మందిపై కేసులు

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్

వరంగల్, నవంబర్ 16(జై భీమ్ క్రైమ్ న్యూస్)

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 44 మంది పట్టుబడ్డారు. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీమతి ఎన్. శ్వేత ఐపీఎస్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ (ట్రాఫిక్ అండ్ లా అండ్ ఆర్డర్) రాయల ప్రభాకర్ రావు సూచనలతో, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మందికి రూ.47 వేల జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మరో ఆరుగురికి రూ.3 వేల జరిమానా విధించారు. వీరిలో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. రాజశేఖర్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం ఆ ముగ్గురి డ్రైవింగ్ లైసెన్సులను ఏడాది పాటు సస్పెండ్ చేయడంతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి. వెంకన్న మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, డ్రైవింగ్ లైసెన్సులు కూడా సస్పెండ్ అవుతాయని తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.



సేవా రంగంలో స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం డాక్టర్ భాస్కరరావు

మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆత్మీయ సన్మానం చేసిన డాక్టర్ బరిగెల శివ
వైద్య సేవల ద్వారా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ భాస్కరరావు సేవలు అభినందనీయం

హైద్రాబాద్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

వైద్య రంగంలో తనదైన ముద్ర వేస్తూ, వైద్య సేవలను కేవలం వృత్తిగా కాకుండా మానవసేవకు గొప్ప మార్గంగా మలుచుకుంటున్న కిమ్స్ హాస్పిటల్ ఫౌండర్, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కరరావును జై భీమ్ టీవీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఆత్మీయంగా సన్మానించారు. వైద్య రంగంలో ఆయన అందిస్తున్న సేవలను అభినందిస్తూ, ఆయన ప్రస్థానం ఎంతోమందికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడం మాత్రమే గొప్పతనం కాదని, మనం సాధించిన విజయాలు సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతున్నాయన్నదే నిజమైన విజయానికి కొలమానమని అన్నారు. వ్యక్తిగత ఎదుగుదలతో పాటు సమాజ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసే వ్యక్తులు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటారని పేర్కొన్నారు. వైద్య రంగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారికి ధైర్యం, భరోసా కల్పించడం కూడా వైద్య సేవల్లో ముఖ్యమైన భాగమని తెలిపారు. కిమ్స్ హాస్పిటల్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో డాక్టర్ భాస్కరరావు కృషి, దూరదృష్టి, పట్టుదల, నాయకత్వ లక్షణాలు ప్రశంసనీయమని డాక్టర్ బరిగెల శివ అన్నారు. వైద్య రంగంలో ఆధునిక సదుపాయాలు, నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో వైద్య సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాన్య ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. కష్టపడే తత్వం, నిరంతర శ్రమ, స్పష్టమైన లక్ష్యం, సేవాభావం ఉన్న వ్యక్తులు ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొంటూ, డాక్టర్ భాస్కరరావు జీవన ప్రస్థానం యువతకు, వైద్య రంగంలోకి రావాలనుకునే వారికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఒక వ్యక్తి సాధించిన విజయం అతనికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలోని మరెందరికో ప్రయోజనం చేకూర్చినప్పుడే ఆ విజయానికి నిజమైన విలువ ఉంటుందని అన్నారు. సమాజంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న ప్రముఖులను గుర్తించి గౌరవించడం, వారి సేవలను ప్రజలకు తెలియజేయడం ద్వారా మరింతమందిలో సేవాభావం పెంపొందుతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మరిన్ని విజయాలు సాధిస్తూ, వైద్య రంగంలో తన సేవలను కొనసాగించాలని, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సేవా దృక్పథంతో సమాజానికి ఉపయోగపడే వ్యక్తుల ప్రోత్సాహమే ఆరోగ్యకరమైన, సేవాభావం కలిగిన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు.



కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ తరఫున రెండు డివిజన్లలో నామినేషన్లు

66వ, 2వ డివిజన్ల నుంచి రంబాల వెంకటేశ్వరరావు నామినేషన్ల దాఖలు



కాకినాడ, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున రంబాల వెంకటేశ్వరరావు రెండు డివిజన్లలో నామినేషన్లు దాఖలు చేశారు. 66వ డివిజన్‌తో పాటు 2వ డివిజన్ నుంచి ఆయన తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. డివిజన్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు తదితర సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని రంబాల వెంకటేశ్వరరావు వెల్లడించారు.

పీజీ విద్యార్థులకు కమ్యూనికేట్ ఇంగ్లీష్ కోర్సు ప్రారంభం



వరంగల్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలోని అన్ని పీజీ కోర్సుల విద్యార్థుల కోసం రెండు క్రెడిట్ల 'కమ్యూనికేట్ ఇంగ్లీష్' కోర్సును ప్రారంభించారు. ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ కోర్సును ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలంటే ఆంగ్ల భాషా నైపుణ్యాలు అవసరమని తెలిపారు. ఈ కోర్సును సద్వినియోగం చేసుకుని తమ కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఆర్. మేఘనా రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ సామర్థ్యం, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే కోర్సు లక్ష్యమని తెలిపారు. విశ్వవిద్యాలయం రూపొందించిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత విభాగాల్లో తరగతులు నిర్వహిస్తామని, విద్యార్థుల హాజరు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిద్ధం కావచ్చని తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

డ్రగ్ టెస్టింగ్ కిట్ల కొనుగోలుకు ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ ముందడుగు..
ట్రస్ట్ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డికి సీపీ అభినందనలు

వరంగల్ । నవంబర్ 16 । జై భీమ్ న్యూస్

యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ చేపడుతున్న కార్యక్రమాలకు ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. డ్రగ్ పరీక్షల నిర్వహణకు అవసరమైన టెస్టింగ్ కిట్ల కొనుగోలు కోసం ట్రస్ట్ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను కలిసి లక్ష రూపాయల చెక్కును అందించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, డ్రగ్స్ వినియోగిస్తున్న వారిని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించడం, మాదకద్రవ్యాల విక్రయాలపై నిఘా పెంచడం వంటి పోలీసుల కార్యక్రమాలకు ఈ విరాళం ఉపయోగపడనుంది. సామాజిక బాధ్యతతో స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకారం అందించిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డిని ఈ సందర్భంగా సీపీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమానికి చొరవ చూపిన కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డిని కూడా పోలీస్ కమిషనర్ అభినందించారు. డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని సీపీ పేర్కొన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలపై సమిష్టిగా పోరాడాలని, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు దూరంగా యువత.. ఆరోగ్యకరమైన సమాజం మనందరి లక్ష్యం అనే సందేశంతో ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలన ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షించారు.

ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి

ఎం. రాజయ్యను సన్మానించిన రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం



హన్మకొండ, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటూ, ఆర్థిక క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగించాలని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సూచించారు. సోమవారం సాయంత్రం కాకతీయ విశ్వవిద్యాలయ కమిటీ హాల్‌లో అక్టోబర్ నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన విశ్వవిద్యాలయ ప్లంబర్ ఎం. రాజయ్యను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ, నైపుణ్యం కలిగిన కార్మికుల సంఖ్య తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాజయ్య విశ్వవిద్యాలయానికి అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. ఉద్యోగ విరమణ అనేది జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని, ఈ దశలో కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ హబీబుద్దీన్, ఉద్యోగ సంఘాల బాధ్యులు నవీన్, తిరుపతి, దామోదర్, సతీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల సమన్వయం చేశారు.

నివాస్ లీలలు.. (న)రేసుగుర్రం పరుగులు!

సలాం కొడితేనే పని.. నజరానా ఇస్తేనే ఫైలు కదులుతుంది
22 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల వ్యవహారంపై అనుమానాలు..
చైన్‌మెన్లపైనా ఒత్తిళ్ల ఆరోపణలు!



వరంగల్ । నవంబర్ 16 । జై భీమ్ న్యూస్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో 'రేసుగుర్రం' హవా నడుస్తోందా? ఏ పని కావాలన్నా ముందుగా సలాం.. ఆ తర్వాత నజరానా సమర్పించాల్సిందేనా? ప్రతి ఫైలుకు ఒక రేటు అన్న ప్రశ్నలు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సలాం చేయకపోతే, అడిగిన నజరానా ఇవ్వకపోతే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పనులు నిలిచిపోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మరోవైపు 22 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల విధుల వ్యవహారంలో వసూళ్ల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విధుల నిర్వహణలో వచ్చిన మొత్తాల్లో కొంత భాగాన్ని నివాస్, 'రేసుగుర్రం'కు సమర్పించాల్సి వస్తోందనే ప్రచారం సాగుతోంది. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లతోనే ఆగకుండా చైన్‌మెన్ల నుంచి సైతం బహుమతులు, మద్యం బాటిళ్లు, దుస్తులు ఆశిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇక లీగల్ సెల్‌లో ప్రత్యేక సమావేశాలు, విధుల సమయం దాటిన తర్వాత కూడా కొనసాగుతున్న భేటీలు మరిన్ని సందేహాలకు తావిస్తున్నాయి. ఈ సమావేశాల వెనుక అసలు కథ ఏమిటి? ఉద్యోగులపై ఒత్తిళ్లు ఉన్నాయా? ఆరోపణల్లో వాస్తవమెంత? లిప్రభుత్వ కార్యాలయం ప్రజలకు సేవ చేయాల్సిన వేదికా.. లేక సలాములు, నజరానాల కోసం నడిచే దర్బారా?లి ఈ ప్రశ్నలకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ విచారణతో సమాధానం చెప్పాలి. హాజరు రికార్డులు, ఫైళ్ల కదలిక, సమావేశాల వివరాలు పరిశీలించి నిజానిజాలు బయటపెట్టాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. సంబంధిత వ్యక్తుల వివరణ కూడా ప్రజల ముందుకు రావాలి. లిసలాం వెనుక ఎవరి స్వార్థం? నజరానాల వెనుక ఎవరి హస్తం? బల్దియాలో ఈ 'రేసు'కు బ్రేక్ వేసేదెవరు.

డ్రగ్స్ పరీక్షల కిట్ల కొనుగోలుకు రూ.లక్ష విరాళం

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ సహకారం

వరంగల్, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ చేపడుతున్న కార్యక్రమాలకు ఇనుగాల చారిటబుల్ ట్రస్ట్ తన వంతు సహకారం అందించింది. డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన టెస్టింగ్ కిట్ల కొనుగోలు కోసం ట్రస్ట్ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రూ.లక్ష చెక్కును అందించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అరికట్టడంతో పాటు, డ్రగ్స్ వినియోగిస్తున్న వారిని గుర్తించేందుకు పోలీసు శాఖ విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తోంది. అలాగే మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాపై నిఘా పెంచేందుకు అవసరమైన డ్రగ్ టెస్టింగ్ కిట్ల కొనుగోలుకు ఈ విరాళం ఉపయోగపడనుంది. సమాజంలో డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న నేపథ్యంలో, దాని నిర్మూలనకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు సామాజిక బాధ్యతగా ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చొరవ చూపిన కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు సహకారం అందించిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డిని సీపీ ప్రశంసించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ఒక్క పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించగలమని ఆమె ఆకాంక్షించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

హసన్‌పర్తి, నవంబర్ 16(జై భీమ్ క్రైమ్ న్యూస్)

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంబర్తి గ్రామం చకలివాడలో డబ్బులు పణంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నవంబర్ 16న సాయంత్రం 4:30 గంటల సమయంలో చంద్రగిరి శేఖర్ ఇంటి ముందు బహిరంగ ప్రదేశంలో పేకాట జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన వారిని వెంబడించి పట్టుకున్నారు. అరెస్టయిన వారిలో పెంబర్తికి చెందిన చంద్రగిరి శేఖర్ (58), తీగల సమ్మయ్య (59), వల్లాల ఐలయ్య (57), హసన్‌పర్తిలోని కిట్స్ కళాశాల సమీపంలో నివసించే నరిహరి లక్ష్మారెడ్డి (46), హనుమకొండకు చెందిన వేముల రమేష్ (49) ఉన్నారు. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి వారి నుంచి రూ.5 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, 52 పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

స్కూల్ బస్సు డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు ద నిర్వహించాలి: పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత





హన్మకొండ, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధ్యక్షతన ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తింపు, బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల మౌలిక సదుపాయాల మెరుగుదల తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, రహదారులపై ప్రమాదకర పరిస్థితులను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌కు నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించామని, అతని డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు తమ బస్సు డ్రైవర్లకు క్రమం తప్పకుండా బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసి, రహదారుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ఈఈ దేవిక చౌహన్, నేషనల్ హైవే మేనేజర్ లింగయ్య రోడ్డు భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ చేరాలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెంచిన బీటెక్ హాస్టల్ ఫీజులను తగ్గించాలి

కాకతీయ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ధర్నా




వరంగల్, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

కాకతీయ యూనివర్సిటీలో బీటెక్ విద్యార్థుల హాస్టల్ రెన్యువల్ ఫీజులను పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పెంచిన ఫీజుల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. యూనివర్సిటీ హాస్టళ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం, గదుల మరమ్మతులు వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. పెంచిన హాస్టల్ ఫీజులను తగ్గించాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వంశీ, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నూరు సాయికుమార్, బీరెడ్డి జశ్వంత్, బీటెక్ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, రాఘవేందర్, నాయకులు గోపి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాయిగా బ్రతకండి.. ఉన్నంతలో తృప్తిగా జీవించండి!

సామాజిక శాస్త్రవేత్త, కవి & రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్



జీవితంలో ఆలోచన, ఆచరణ, నిజాయితీ, సంతృప్తి ఎంతో ముఖ్యం

సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్

అమరావతి, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

మనిషి జీవితంలో సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలంటే అనవసరమైన ఆర్భాటాలకు దూరంగా ఉంటూ, ఉన్నంతలో తృప్తి చెందడం అలవాటు చేసుకోవాలని సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి పరిస్థితిని ఆలోచనతో ఎదుర్కొంటూ, మంచిచెడులను బేరీజు వేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన ఆనందం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'హాయిగా బ్రతకండి' అనే సందేశంతో జీవితానికి సంబంధించిన పలు సామాజిక, కుటుంబ, వ్యక్తిత్వ అంశాలను వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మనిషి జీవితంలో ఎన్నో ప్రశ్నలు ఎదురవుతుంటాయని, వాటికి సమాధానాలు వెతికే క్రమంలో ఆలోచన ఎంతో ముఖ్యమని అన్నారు. ఏదైనా విషయం అవునా? కాదా? అనే సందేహం వచ్చినప్పుడు తొందరపడి నిర్ణయం తీసుకోకుండా ఆలోచిస్తే సరైన సమాధానం దొరుకుతుందని వివరించారు. కుటుంబ వ్యవస్థలో ఇల్లాలు ఇంటికి వెలుగని, ఎదిగిన పిల్లలు కుటుంబానికి బలమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు, పరస్పర గౌరవం ఉన్నప్పుడే కుటుంబ జీవితం ఆనందంగా సాగుతుందని తెలిపారు. ఉన్నంతలో తృప్తిగా జీవించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాల్సిన ముఖ్యమైన విషయమని, ఇతరుల ముందు గొప్పగా కనిపించాలనే ఉద్దేశంతో అనవసర ఖర్చులు చేయడం, ఆర్భాటాలకు పోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. ఆర్థిక స్థోమతను మించి ఖర్చులు చేయడం, అప్పుల ఊబిలో చిక్కుకోవడం కుటుంబ ప్రశాంతతను దెబ్బతీస్తాయని వివరించారు. సాధ్యమైనంత వరకు అప్పులు చేయకుండా జీవించేందుకు ప్రయత్నించాలని, ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే ఎవరిని పడితే వారిని గుడ్డిగా నమ్మడం వల్ల నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని, వ్యక్తులను వారి మాటల ఆధారంగా కాకుండా ప్రవర్తన, నడవడిక ఆధారంగా అర్థం చేసుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరి జీవిత పరిస్థితులు ఒకేలా ఉండవని, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాల్లో పరస్పర గౌరవం, అవగాహన అవసరమని పేర్కొన్నారు. సమాజంలో కొందరు ఇతరుల కష్టార్జితాన్ని దోచుకుంటూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తారని, మరికొందరు తమ అసలు స్వరూపాన్ని దాచిపెట్టి మోసాలకు పాల్పడుతుంటారని వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరానికి మించి నటించడం, అతిగా ప్రవర్తించడం చివరకు కీడుకు దారితీస్తుందని, వ్యక్తిత్వంలో సహజత్వం, నిజాయితీ ఉండాలని తెలిపారు. మనిషి జీవితంలో తప్పులు జరగడం సహజమని, అయితే వాటిని గుర్తించి అంగీకరించడం గొప్ప లక్షణమని డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. తప్పులను సమర్థించుకోవడం కంటే వాటిని ఒప్పుకుని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించడం వల్ల వ్యక్తిత్వం మరింత



మెరుగుపడుతుందని వివరించారు. నిజాయితీగా వ్యవహరించడం, ఇతరులను గౌరవించడం, మన ప్రవర్తనకు మనమే బాధ్యత వహించడం ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు. జీవితంలో అనేక సమస్యలు, అపోహలు, అబద్ధాలు, అనవసరమైన ఆందోళనలు మనిషిని మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తాయని, వాటన్నింటినీ అధిగమించేందుకు ప్రశాంతమైన ఆలోచనా విధానం అవసరమని తెలిపారు. ముఖ్యంగా అనారోగ్యం, ఆవేశం మనిషి ఆనందాన్ని దూరం చేస్తాయని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కోపతాపాలకు దూరంగా ఉంటే జీవితం ఎంతో హాయిగా ఉంటుందని వివరించారు. మొత్తంగా మనిషి జీవితానికి సంతృప్తి, ఆలోచన, నిజాయితీ, కుటుంబ అనుబంధాలు, ఆర్థిక క్రమశిక్షణ, ఆరోగ్యం ఎంతో అవసరమని సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. ఇతరులతో పోల్చుకుంటూ జీవించకుండా మన స్థితిగతులను అర్థం చేసుకుని, ఉన్నదానిలో ఆనందాన్ని వెతుక్కుంటూ, ఆవేశం, అనవసర ఆర్భాటాలకు దూరంగా ఉంటే ప్రతి ఒక్కరూ హాయిగా, సంతోషంగా జీవించవచ్చని ఆయన సందేశమిచ్చారు.

డాక్టర్ పోలం సైదులు మృతి పరిశోధనా రంగానికి తీరని లోటు

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా సంస్మరణ సభ.. పరిశోధనా కృషి, సామాజిక సేవలను స్మరించుకున్న అధ్యాపకులు, పరిశోధకులు



హన్మకొండ, నవంబర్ 16 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన పరిశోధకుడు డాక్టర్ పోలం సైదులు అకాల మరణం పరిశోధనా రంగానికి, విశ్వవిద్యాలయానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. నవంబర్ 12, 2026న ఆయన మృతి చెందడం పట్ల సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ పోలం సైదులు సంస్మరణ సభను నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రొఫెసర్ కుంటా ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభకు తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అధ్యాపకులు, పరిశోధకులు డాక్టర్ సైదులుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన పరిశోధనా కృషి, సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. విద్యా, పరిశోధనా రంగాల్లో డాక్టర్ పోలం సైదులు చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన అకాల మరణం కుటుంబ సభ్యులతో పాటు సహచరులు, అధ్యాపకులు, పరిశోధకులకు తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. పరిశోధన పట్ల ఆయనకున్న ఆసక్తి, సామాజిక సమస్యలపై ఆయన చేసిన అధ్యయనాలు భవిష్యత్ పరిశోధకులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ నీలం రాములు, విశ్వవిద్యాలయ మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సమ్మయ్య, మాజీ రిజిస్ట్రార్ సదానందం, ఎస్‌డీఎల్‌సీ మాజీ డైరెక్టర్ చింతకాయల దినేష్ కుమార్, పాలకమండలి సభ్యులు చిర్ర రాజు గౌడ్, సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, ప్రొఫెసర్ కుంటా ఐలయ్య, డాక్టర్ పోలు శేఖరయ్య, డాక్టర్ సాతూరి రఘు, డాక్టర్ వేముల చంద్రమౌళి, కె. వాసు, సుభాష్, సాయితి, ప్రసన్న, విజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే విభాగానికి చెందిన అధ్యాపకులు, పార్ట్‌టైమ్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ పోలం సైదులు చిత్రపటానికి నివాళులర్పించి ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలు, పరిశోధనా స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పలువురు అభిప్రాయపడ్డారు.

ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌కు జేఏసీ నేతల మద్దతు

అధికారులపై వ్యక్తిగత దూషణలు తగవు.. ఘటనను తీవ్రంగా ఖండించిన ఉద్యోగ సంఘాల నాయకులు



వరంగల్, నవంబర్ 16(జై భీమ్ న్యూస్)

వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, అధికారుల మధ్య జరిగిన వాగ్వాదంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌ను అవమానిస్తూ మాట్లాడిన ఘటనను ఉద్యోగ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్, వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ గాజే వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌ను పరామర్శించి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ ఆర్. లక్ష్మణుడిని కలిసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు, ఉద్యోగులకు ఉద్యోగ సంఘాల తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరైన పద్ధతి కాదని పేర్కొంటూ ఘటనను తీవ్రంగా ఖండించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో అధికారులు సయోధ్యకు వెళ్లారని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు పనిచేస్తున్నప్పుడు వారిని అవమానించడం తగదని ఉద్యోగ సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలు బైరి సోమయ్య, సదానందం, పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, రాము నాయక్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, భాస్కర్, అశోక్, కిరణ్, ప్రణయ్, పృథ్వి, సుధాకర్, నిఖిల్, మహేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM